క్లుప్తంగా

11న మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి పరీక్ష

కలిగిరి: కలిగిరి ఏపీ మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనువాసులు మంగళవారం తెలిపారు. ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. apms.apcfss.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన సూచించారు.

రోడ్డు పనులు పరిశీలించిన సీఈ



సత్యవోలు వద్ద కాజ్‌వేను పరిశీలిస్తున్న సీఈ

ఉదయగిరి: ఉదయగిరి నియోజవర్గంలోని కొండాపురం, కలిగిరి మండలాల్లో ఏఐబీ నిధులతో జరుగుతున్న వివిధ పనులను మంగళవారం పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీరు సీవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. సత్యవోలు-గానుగపెంట మార్గంలో నిర్మించిన కాజ్‌వేను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజవర్గంలో రూ.50 కోట్లతో 92 పనులు జరుగుతున్న నేపథ్యంలో కొన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా అన్నీ పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఉదయగిరి డీఈఈ సుబ్బారెడ్డి, పలువురు ఏఈలు ఉన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు లీజు వేలం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఖాళీగా ఉన్న 5,450 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని 15 ఏళ్ల పాటు లీజు ప్రాతిపదికపై వేలం నిర్వహిస్తున్నామని డిపో మేనేజరు కరిముల్నీసా మంగళవారం తెలిపారు. తన కార్యాలయంలో ఈ మేరకు విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారు రూ.5,900 నగదును ఆన్‌లైన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చమన్నారు. మరిన్ని వివరాలకు www. apsrtc. ap. gov. in వెబ్‌సైట్‌ను ఉపయోగించాలని లేదా డిపో మేనేజరు సెల్ 9959225645లో సంప్రదించాలని కోరారు.

జిల్లా ఉద్యానశాఖ అధికారి తనిఖీ



ఆదూరుపల్లి సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి సచివాలయాన్ని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను, రిజిస్టర్‌ను పరిశీలించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదూరుపల్లి పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు ఉన్నారు.

సచివాలయం తనిఖీ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని దేవరాయపల్లి బిట్-1 సచివాలయాన్ని మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్ మంగళవారం పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్‌ను పరిశీలించారు. రెగ్యులర్ సర్వీసులు, స్పందన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పవర్ స్ప్రేయర్ పంపిణీ

ఉదయగిరి: మండలంలోని కృష్ణంపల్లికి చెందిన రైతు కొండ్రెడ్డి భాస్కర్‌రెడ్డికి మంగళవారం ఓ స్వచ్ఛంద సేవ సంస్థ పవర్‌స్ప్రేయరు అందజేసింద.ఇ గ్రామంలోని రైతులు తమ పొలాలకు మందు పిచికారీ చేసుకునేందుకు దీనిని వినియోగించుకోవాలని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు.

డ్రోన్‌ల ద్వారా భూసర్వే నేడు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో జగనన్న భూహక్కు, భూరక్షా పథకంలో భాగంగా డ్రోన్ల ద్వారా సర్వే బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి డ్రోన్లపై సర్వే కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ప్రజలు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొని కోరారు.

గమళ్లపాళెం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

జలదంకి: జలదంకి పంచాయతీ గమళ్లపాళెం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ సీహెచ్ పద్మావతితో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని సమస్యలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వీరివెంట మండల సచివాలయాల కన్వీనరు తిప్పారెడ్డి ఇందిరమ్మ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

జలదంకి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు కఠిన తప్పవని జలదంకి ఎస్సై వీరేంద్రబాబు హెచ్చరించారు. మంగళవారం జలదంకి మద్యం దుకాణం సమీపంలోని షాపులను పరిశీలించి షాపుల ఆవరణలో మద్యం తాగిస్తే షాపు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న పలువురిని అరెస్ట్ చేశారు.

ప్రజలకు స్వచ్ఛమైన పాలన, సేవలు

- లక్ష్యంగా మున్సిపల్ సిబ్బంది పని చేయాలి
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి. పక్కన కమిషనర్ కిరణ్

కావలి: 'జిల్లాలో జిల్లా కేంద్రం నెల్లూరు తర్వాత రెండో అతి పెద్ద పట్టణం కావలి. వ్యాపార, వాణిజ్య పరంగానే కాకుండా పారిశ్రామికంగానూ శరవేగంగా అడుగులు వేస్తోంది. అన్ని రకాలుగా ప్రాధాన్యతను సంతరించుకుంటున్న అత్యంత కీలకమైన కావలి పట్టణానికి ప్రజలు బతుకుదెరువు కోసం వలసలు వస్తున్నారు. రాబోయే రోజుల్లో మహానగరంగా విస్తరించే అవకాశం ఉంది. ఇదే సమయంలో ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా స్వచ్ఛమైన పరిపాలన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని' కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచించారు. కావలి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ ఈ.కిరణ్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో శాశ్వతంగా నివాసం ఉంటున్న ప్రజలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కావలికి వచ్చి స్థిరపడేవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని మునిసిపాలిటీలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ప్రజలకు అత్యంత వేగంగా సేవలు అందించాలని చెప్పారు. పట్టణంలో పారిశుద్ధ్యపై ప్రజలు ఎక్కడా అసౌకర్యానికి గురి కాకుండా ఉండేలా నితరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన అన్నీ వసతులు కచ్చితంగా సమకూర్చాలని, అప్పుడే పట్టణంలోని ప్రధాన వీధులతో పాటు, నివాస ప్రాంతాల్లో చెత్త చెదారం నిల్వలు ఉండదని తెలిపారు. తాగునీటి సరఫరా విషయంలో మున్సిపల్ అధికారులు మరింత శ్రద్ధ తీసుకోవాల్సి ఉందన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుంచి పట్టణంలోని తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ 25 ఏళ్ల క్రితం నిర్మించింది కావడంతో నిత్యం మరమ్మతులకు గురవుతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. దీని వల్ల ప్రజలకు నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టి పైప్‌లైన్లను మార్పించే పనులు చేసే, ప్రజలకు నీటి సరఫరాలో జాప్యం తలెత్తకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాలు, గాలులు, పిడుగులు తదితర కారణాలు వల్ల పట్టణంలో ట్రంక్‌రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌తో పాటు, పెద్ద సంఖ్యలో వీధి లైట్లు వెలగడం లేదని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అన్ని వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కుక్కలు, పందులు, కోతులు సమస్యలపై ప్రజల నుంచి నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయని, వాటితో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే అధికారులకు వివరించారు. ఆయా సమస్యలపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపండి

- ఎంపీపీ రమాదేవి



మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

చేజర్ల: మండలంలో తరచూ ఎదురువుతున్న విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపాలని చేజర్ల మండల ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకపోయినప్పటికీ, ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా తరచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంగా ప్రజలు భావిస్తున్నారు. మీ వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని చురకలు అంటించారు. మంగళవారం చేజర్ల మండల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కురిసిన గాలివానకు మండలంలోని కొలపనాయుడుపల్లితో పాటు ఇతర గ్రామాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో విద్యుత్ సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్ సమాధానం చెబుతూ వీలైనంత త్వరగా మండలంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి తూర్పు కంభంపాడులో పంచాయతీ సర్పంచ్ తీర్మానం లెటర్ ఇవ్వలేదన్నారు. కూలీలకు ఉపాధి హామీ పనుల కోసం అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి పంచాయతీ తీర్మానం తీసుకోవాలని కోరారు. అనంతరం మండలంలోని రెవెన్యూ సమస్యలపై ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎంపీడీఓ షేక్ కరిముల్లా, మండల ఏఓ విజయలలిత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మెట్టుకూరిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



స్థానిక నేతలతో మాట్లాడుతున్న మెట్టుకూరి చిరంజీవిరెడ్డి

ఉదయగిరి: ఉదయగిరికి వచ్చిన ఏపీ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డిని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చిరంజీవిరెడ్డి నేతలను పరిచయం చేసుకుని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని ఉదయగిరి-నందవరం డబుల్ రోడ్డు, కొనకాలువ పరిస్థితి, సామాజిక ఆరోగ్య కేంద్ర సమస్యలు పరిష్కరించేలా చూడాలని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముర్తుజా హుస్సేన్, నాయకులు గానుగపెంట శ్రీనివాసులురెడ్డి, మట్ల రామయ్య, కాలేషా, అనిల్, రఫీ పాల్గొన్నారు.

అప్పుడు రాజ్యాంగ విలువలు గుర్తు రాలేదా?



ఏఎస్‌పేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

- 'ఆనం' విమర్శలపై వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు

ఆత్మకూరు (అనుమసముద్రంపేట): గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉండి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి శిలాఫలకాలపై ప్రముఖంగా పేరు రాయించుకున్న మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాజ్యాంగ విలువలు గురించి మాట్లాడడం హాస్యాస్పందంగా ఉందని ఏఎస్‌పేట వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వంపై, ఆత్మకూరు అభివృద్ధిపై ఇటీవల ఆనం విమర్శలు చేయడాన్ని తప్పు పట్టారు. ఏఎస్‌పేట ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ కో-ఆర్డినేటర్ పూనూరు వెంకట రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ ఛాంబర్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. 2014లో ఇక్కడ పోటీ చేసి దారుణంగా ఓడిపోయిన విషయాన్ని కూడా గుర్తు చేసుకోవాలన్నారు. ఆయన దయతో 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వెంకటగిరి నియోజకవర్గం నుంచి గెలిచిన విషయం ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఆత్మకూరు నియోజకవర్గం నుంచి 33వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన మేకపాటి గౌతమ్‌రెడ్డిని ఆనం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు ఏ మాత్రం గౌరవించారని, ప్రోటోకాల్ పాటించారని ప్రశ్నించారు.

విద్యతో భావితరాలకు బాటలు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి నాడు-నేడు పనుల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తూ భావితరాలకు బాటలు వేస్తున్నారని చెప్పారు. విద్యాభివృద్ధితో రానున్న తరాలకు ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందన్న విషయం 40 ఏళ్ల రాజకీయ తమదని చెప్పుకొనే ఆయనకు తెలియదా అని నిలదీశారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న వలంటీరు, సచివాలయ వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేసేందుకు పరిశీలిస్తుండగా ఆ వ్యవస్థలను ఆనం విమర్శించడం ఆయన స్థాయికి తగదన్నారు. రాజ్యాంగ విలువలు నిర్వీర్యమైపోతున్నాయని పదే పదే చెబుతున్న ఆనం ముందు ఆయన నీతులు ఆచరించి అందరికి చెప్పాలన్నారు. దుర్మార్గపు పాలన అని విమర్శించడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ సందానీ, వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ షౌకత్ ఆలి, పీఏసీఎస్ చైర్మన్ కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు కాటంరెడ్డి తిరుపతి రెడ్డి, ఎ.కోటిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఐతా వెంకటేశ్వర్లు, వెంకట రమణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రవాణాశాఖాధికారి తనిఖీలు



బస్సు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరికరంతో తనిఖీలు నిర్వహిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని బ్రాహ్మణపల్లి జాతీయ రహదారిపై టోల్‌గేటు వద్ద మంగళవారం ఆత్మకూరు రవాణాశాఖ ఎంవీఐ రాములు డ్రంక్‌అండ్ డ్రైవ్ పరికరంతో వాహనాలు, డ్రైవర్లను తనిఖీ చేశారు. ముఖ్యంగా సీసీ బస్సులు, కార్లు, లారీలు, తదితర వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్లకు సూచనలు చేశారు. కొందరు డ్రైవర్లు నిద్రమత్తులో ఉండడాన్ని గమనించి నీటిలో ముఖం కడిగించి జాగ్రత్తలు చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోండి



వేసవి శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

చేజర్ల (సోమశిల): విద్యార్థులు చిన్నతనం నుంచి వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని తద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని అనంతసాగరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం అనంతసాగరంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో ఆయన విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నారాయణరావు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

- ఐదు బైక్‌లు, రూ.2,430 నగదు స్వాధీనం

సంగం: మండలంలోని వంగల్లు చెరువు సమీపంలో పేకాట స్థావరాలపై పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. నలుగురు పేకాట రాయళ్లను అరెస్ట్ చేసి, రూ.2,430 నగదు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వంగల్లు చెరువు సమీపంలో జోరుగా పేకాట సాగుతున్నట్లు సంగం పోలీసులకు సమాచారం అందడంతో దాడులు చేశారు.

మలేరియా వారోత్సవాల అవగాహనా ర్యాలీ



ఉదయగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



చిత్తలూరులో మలేరియా నివారణ మాసోత్సవం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది మంగళవారం మలేరియా మాసోత్సవాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి శివకల్పన, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులు దోమల వల్ల సోకుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రాత్రివేళ దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటసుబ్బయ్య, అక్బర్‌బాషా ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిని నిర్మూలిద్దాం

చేజర్ల: మలేరియా వ్యాధిని నిర్మూలించాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యురాలు ప్రమీలా రాజకుమారి అన్నారు. మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా నిలువ నీటి ప్రదేశాలను అరికట్టాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. చిత్తలూరు పీహెచ్‌సీలో మలేరియా నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్, జ్యోతి, పవన్‌కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్లు ఎం.సత్యవతి, సుప్రజ పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

- ఉపాధి పనుల ఆడిట్‌పై ప్రజావేదిక



ఉపాధి పథకం ఆడిట్ ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ వెంకట్రావు

ఆత్మకూరు (అనుమసముద్రంపేట): ఉపాధి హామీ పనులు పేదలకు వరం వంటిదని, అయితే ఆ పనులను నిర్వహించే ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది బాధ్యతగా పనిచేసి కూలీలకు పారదర్శకంగా నగదు చెల్లింపులు చేయాలని డ్వామా పీడీ డి.వెంకట్రావు సూచించారు. ఏఎస్‌పేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉపాధి పనుల ఆడిట్‌పై ప్రజావేదిక నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన 660 పనులకు రూ.7,43,471 ఖర్చు చేసినట్లు చెప్పారు. అయితే జరిగిన పనులపై వారం రోజులుగా క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్ సిబ్బంది పరిశీలించి నివేదికలు రూపొందించారు. కూలీలకు రూ.5,91,87,000 చెల్లించగా, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.9.89 లక్షలు, పంచాయతీరాజ్ విభాగంలో 36 పనులకు రూ.1, 41,78,000 ఖర్చు చేసినట్లు పీడీ వివరించారు. మండలంలోని మొత్తం జరిగిన పనుల్లో సుమారు రూ.5 వేల పక్కదారి పట్టినట్లు నిర్ధారించామన్నారు. ఈ మొత్తాన్ని సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీ వెంకట్రావు మాట్లాడుతూ కోట్లాది రూపాయల నిధులు ఉపాధి పనుల కోసం మంజూరు అవుతున్నాయని, అవి సద్వినియోగం అయ్యేలా గ్రామాల్లో పనులు ప్రణాళిక మేరకు రూపొందించి పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, ఉపాధి పథకం డీవీఓ సురేష్‌బాబు, ఎంపీడీఓ భాస్కర్, ఈసీ నవీన్, ఎంపీటీసీలు, ఉపాధి సాంకేతిక సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించండి

ఆత్మకూరు (అనుమసముద్రంపేట): ఏఎస్‌పేటలోని శ్రీహజ్రత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా ప్రాంతంలో రోడ్డును 30 అడుగుల మేర వెడల్పు చేయడానికి ఏపీ లోకాయుక్త ఆదేశాలు జారీ చేసిందని, ఆ మేరకు ఆ ప్రాంతంలో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి షేక్ యస్దానీ బాషా కోరారు. దర్గా ప్రాంతంలో రోడ్డు వెడల్పులో భాగంగా నగరఖానా నుంచి ఆనకట్ట వరకు దర్గా మొదటి గేటు నుంచి దొరసానమ్మ తోట వరకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సర్వే నంబరు 124, 133లలో మార్కింగ్ ఇచ్చి ఉన్నారన్నారు. మంగళవారం ఆయన ఆ మార్కింగ్ మేరకు ఆక్రమణలను వారం రోజుల వ్యవధిలో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, జిల్లా పంచాయతీ అధికారి అవకాశం ఇచ్చారని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 11వ తేదీ అనంతరం ఆక్రమణలను ప్రభుత్వ నిబంధనల మేరకు తొలగించడం జరుగుతుందని తెలిపారు.

పకడ్బందీగా ఈ క్రాప్ నమోదు



మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజు

అల్లూరు: పకడ్బందీగా పంట నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వ్యవసాయ సహాయకులకు కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు తెలిపారు. కొత్తగా వచ్చిన ఏడీఏ నాగరాజు మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క ఎకరా కూడా వదలకుండా పంట నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్ చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏ పొరపాటు జరిగిన పూర్తి బాధ్యత వీఏఏలదే అన్నారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందన్నారు. పీఎం కిసాన్ డబ్బుల కోసం ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ రావు, వీఏఏలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఉదయగిరి సీఐ గిరిబాబు తెలిపారు. మంగళవారం దుత్తలూరు ఎస్సై ఎస్.ప్రభాకర్‌తో కలిసి ఆలయ పరిసరాలు పరిశీలించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఉషశ్రీని కలిసి బ్రహ్మోత్సవాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పురుషామృగ వాహనంపై కోటేశ్వరుడు



పురుషామృగ వాహనంపై దేవదేవేరులు

సంగం: మండలంలోని దువ్వూరులో కొలువైన కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం కల్యాణ మహోత్సవం అనంతరం పుణ్య దంపతులు పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు వేద మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం నిర్వహించారు. అనంతరం వధువరూలను పురుషామృగ వాహనంపై ఉంచి విశేష పూలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

సచివాలయాల్లో ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీలు




కరటంపాడు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మంగళవారం మండలంలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కరటంపాడు, బోయలచిరివెళ్ల, వాశిలి సచివాలయా వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్ల లోపు చిన్నారులకు పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు అందించాలన్నారు. గృహ నిర్మాణ పథకాలు వేగవంతం చేసేందుకు సమష్టిగా పనిచేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు రేవూరు అంకయ్య, ఎల్‌వీ ప్రసాద్, షఫీ, వీఆర్‌ఓలు ప్రతాప్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ఘన నివాళి

అల్లూరు: ఒడిశా రైలు ప్రమాదంలో మృతులకు సంతాపం, గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు అల్లూరు పాత బస్టాండ్ సెంటర్ ఆవరణలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు ఎల్లు సాల్మన్‌రాజు, పప్పు సుధాకర్, పి.శ్రీనివాసులు, ఎం.నవీన్, పి.సుధాకర్, డి.సుబ్బయ్య, డి.మాల్యాద్రి, బి.రాము, బి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న యువజన సంఘం నాయకులు

ఏపీజీఈఏ రిలేనిరాహార దీక్ష

ఉదయగిరి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఏపీజీఈఏ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆ సంఘ సంయుక్త కార్యదర్శి జావీద్, ఉదయగిరి తాలూకా అధ్యక్షుడు కొండారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సర్దార్, వెంకటసుబ్బయ్య, రాజశేఖరరాజు, నౌషాద్, వెంకటేశ్వర్లు, ముబారక్, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పొలం కంచె రాళ్లు టీడీపీ నేతల ధ్వంసం

సీతారామపురం: మండలంలోని బాలాయపల్లి రెవెన్యూ పరిధిలోని రంగనాయుడుపల్లిలో సర్వే నంబర్ 259/3బీలో తమకు చెందిన 5.20 ఎకరాల పొలానికి ఏర్పాటు చేసిన కంచెరాళ్లను కొందరు టీడీపీ నేతలు ధ్వంసం చేశారని యజమాని బసిరెడ్డి రమాదేవి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి పోలంగారిపల్లికి చెందిన కనపర్తి అబ్బిరెడ్డి, కనపర్తి నారాయణ, గోనె గురురెడ్డి, పీట్ల వెంకటేష్, బాలినేని వెంకటయ్య తన పొలంలోకి వచ్చి కంచె ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలు అందించండి

- డ్వామా పీడీ వెంకట్రావు

ఆత్మకూరు(అనుమసముద్రంపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండేలా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించేందుకు నిర్దేశించిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలో మెరుగైన సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి డ్వామా పీడీ వెంకట్రావు సూచించారు. మండలంలోని ఏఎస్‌పేట బిట్-1, బిట్-2 సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆ సచివాలయాల పరిధిలో అందరికీ ఇళ్లు పథకంలో మంజూరైన వైఎస్సార్ జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణ పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలకు పొదుపు మహిళలకు రూ.35 వేల బ్యాంకు ద్వారా లింకేజీ రుణాలు ఇప్పించడంలో చొరవ చూపాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, ఎంపీడీఓ ఎం. భాస్కర్, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.